# కొత్తగూడెంలో మిన్నంటిన రంజాన్ వేడుకలు

## : మైనార్టీ సోదరులకు నాగా సీతారాములు శుభాకాంక్షలు






**కొత్తగూడెం/మార్చి 21(జర్నలిస్ట్ వార్త):**
పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం పట్టణంలోని ఈద్గా వద్ద మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పాల్గొని, ముస్లిం సోదరులకు ఆత్మీయంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ రంజాన్ మాసం సమాజంలో ఐక్యతను, శాంతిని, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని కొనియాడారు.

పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు కేవలం ఆధ్యాత్మిక శుద్ధినే కాకుండా, మనిషిలో సహనం, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందిస్తాయి. మన దేశంలో విభిన్న మతాలు ఉన్నప్పటికీ, అందరి లక్ష్యం శాంతి, మానవత, సౌభ్రాతృత్వమేనని ఆయన గుర్తుచేశారు. సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ పండుగ ప్రజల మధ్య ప్రేమను పెంపొందించి, ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అందరూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకోవడం పట్టణంలో గంగా-జమునా తహజీబ్ సంస్కృతిని ప్రతిబింబించింది.

# గ్రామాభివృద్ధిపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో సర్పంచ్‌ల భేటీ

## కొత్తకొండకు రూ.10 లక్షల అదనపు నిధుల హామీ -రసూల్‌పల్లి, రంగయ్యపల్లికి కూడా సీసీ రోడ్ల హామీ





**భీమదేవరపల్లి/మార్చి21 (జర్నలిస్ట్ వార్త):**
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్ ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కొత్తకొండ గ్రామ అభివృద్ధి పనులకు సహకారం అందించినందుకు గ్రామ సర్పంచ్ మరియు గ్రామ పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం భీమదేవరపల్లి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ మరియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కొత్తకొండ గ్రామ సర్పంచ్ రమ రమేష్, రంగయ్యపల్లి సర్పంచ్ మండల రజిని మహేష్, రసూల్‌పల్లి గ్రామ సర్పంచ్ బోయిని మహేష్‌తో పాటు పలువురు గ్రామ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కొత్తకొండ గ్రామానికి ఇటీవల 5 హైమాస్ట్ లైట్లు, 2 బోర్లు, రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదనంగా మే నెల బడ్జెట్‌లో మరో రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే రసూల్‌పల్లి మరియు రంగయ్యపల్లి గ్రామాలకు కూడా రూ.15 లక్షలతో సీసీ రోడ్లు ఈ నెలలోనే వేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగతా అభివృద్ధి పనులకు కూడా మే నెలలో నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గ్రామ సర్పంచులు మరియు పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విసాక వాటర్ ప్లాంట్‌పై నీలి నీడలు

## పర్యవేక్షణ కరువు.. నీరుగారుతున్న లక్ష్యం
## పట్టించుకోని పాలకులు.. ప్రైవేటు వ్యక్తుల పరం?

### లక్ష రూపాయలకు ప్రైవేటు పరం?

ప్లాంట్‌ను నడపడం గ్రామ పంచాయతీ వల్ల కాకపోవడంతో, చివరకు దీనిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుమారు 1,00,000 ,రూపాయలకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేలా గ్రామ పంచాయతీ తీర్మానం చేసినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన ప్లాంట్, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంపై గ్రామస్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



**ఎల్కతుర్తి/మార్చి 21(జర్నలిస్ట్ వార్త);**
గ్రామస్తుల దాహార్తిని తీర్చాలనే సమున్నత లక్ష్యంతో పదిహేడేళ్ల క్రితం ప్రారంభమైన ఆ మంచినీటి పథకం నేడు నిరాదరణకు గురవుతోంది. నాయకులు మారారు. కమిటీలు మారాయి. కానీ ప్లాంట్ తలరాత మాత్రం మారలేదు. ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో విశాఖ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాంట్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సరైన పర్యవేక్షణ లేక ప్లాంట్ ఉనికి కోల్పోయే స్థితికి చేరుకుంది.

ఘనంగా ఆరంభం..

2007వ సంవత్సరంలో అప్పటి రోడ్లు, భవనాల శాఖ మంత్రి జీవన్ రెడ్డి, విశాఖ ట్రస్ట్ చైర్మన్ వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఈ ప్రాజెక్టు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైంది. అప్పటి సర్పంచ్ దివంగత సోలంకి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో 14 మంది వార్డు సభ్యులు ప్రత్యేక చొరవ చూపారు. ఇంటికి 100 రూపాయల చొప్పున విరాళాలు సేకరించి, ప్లాంట్‌ను ప్రజల వినియోగంలోకి తెచ్చారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల సమక్షంలో గ్రామ పంచాయతీకి అప్పగించిన ఈ ప్లాంట్, కొన్నాళ్ల పాటు గ్రామస్తులకు అండగా నిలిచింది.

### నిర్వహణ లోపం.. దివాలా తీసిన ట్రస్ట్

ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్నా, కాలక్రమేణా పర్యవేక్షణ లోపించింది. ట్రస్ట్ నిర్వహణ భారంగా మారడంతో ప్లాంట్ ఆర్థికంగా దివాలా తీసింది. తదనంతరం వచ్చిన సర్పంచులు ప్రతాప్ రెడ్డి, చల్లా రవీందర్ రెడ్డిలు దీనిని గాడిలో పెట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. సరైన ఆదాయ వనరులు లేకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో ప్లాంట్ పరిస్థితి దయనీయంగా మారింది.

### ఎవరి దారి వారిదే..

ఏండ్లు గడుస్తున్నా ప్లాంట్ ఆధునీకరణకు నోచుకోలేదు. ఒకప్పుడు ఊరందరి దాహం తీర్చిన ప్లాంట్, నేడు పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ మంచినీటి పథకానికి పూర్వవైభవం తీసుకురావాలని దామెర గ్రామస్తులు కోరుతున్నారు.

### వాటర్ ప్లాంట్ నిర్వహణ మెరుగుపరచాలి.

**అలాకుంట ఎల్లయ్య**

వాటర్ ప్లాంట్ ద్వారా ఆదాయం వస్తున్నప్పటికీ, సరైన నిర్వహణ లేకపోవడంతో అది దివాలా తీసే పరిస్థితికి చేరుకుందని అలాకుంట ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి బలమైన ఆదాయం సమకూరాలంటే, ప్లాంట్‌ను, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పద్ధతి ప్రకారం నిర్వహించాలని ఆయన సూచించారు.



### నిర్లక్ష్యం వల్లే వాటర్ ప్లాంట్ దివాలా.

**కదం నర్సింగం**

వాటర్ ప్లాంట్ నిర్వహణలో అధికారులు, సర్పంచుల నిర్లక్ష్యం వల్ల ప్లాంట్ మొదటి నుంచి నష్టాల్లో నడుస్తోందని కదం నర్సింగం విమర్శించారు. ప్లాంట్‌కు ఆదాయం వస్తున్న సమయంలో, పాలక వర్గం నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు దీనిని అప్పగించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్లాంట్‌ను శుభ్రం చేసి, పద్ధతి ప్రకారం నడపాలని డిమాండ్ చేశారు.



# నూతనకల్‌లో ఘనంగా గృహప్రవేశం పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు అడపా అనిల్ చౌదరి



**తల్లాడ/మార్చి21 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని నూతనకల్ గ్రామంలో శనివారం పలు శుభకార్యాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్ట రాగమయి ఆదేశాల మేరకు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు అడపా అనిల్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కొమ్మనబోయిన ప్రసాద్ నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ మహోత్సవానికి అనిల్ చౌదరి హాజరయ్యారు. ఎమ్మెల్యే రాగమయి సూచనల మేరకు ఆయన రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమానికి ప్రత్యేక కానుకను అందజేసి, నూతన ఇంట్లో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విలాసాగరపు తనీష్ కుమార్, నిహాల్‌ల పంచకట్టువేడుకలో అనిల్ చౌదరి చిన్నారులను ఆశీర్వదించి, వారికి గిఫ్టులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అనిల్ చౌదరితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు వీరబాబు ముదిరాజ్, కళ్యాణపు వెంకటయ్య, వారికోళ్ల వంశీ, భద్రం, హరీష్, శ్రీకాంత్ గ్రామస్తులు టాడ్వాతదితరులు పాల్గొన్నారు.


# కేతేపల్లి భాస్కర్ రావుకు ఘన సన్మానం కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియామకంపై హర్షం



**తల్లాడ/మార్చి 21(జర్నలిస్ట్ వార్త);** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన తల్లాడ మండల సీనియర్ నాయకులు కేతేపల్లి భాస్కర్ రావుకు శనివారం ఘన సన్మానం జరిగింది. పార్టీ పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధతకు గుర్తింపుగా ఈ పదవి దక్కడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, సీనియర్ నాయకులు వడ్డే రామారావులు భాస్కర్ రావును శాలువాలతో కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధతకు గుర్తింపు: సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సీనియర్ నేతకు జిల్లా స్థాయిలో పదవి దక్కడం హర్షణీయమని పేర్కొన్నారు. భాస్కర్ రావు నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అప్పగించిన కొత్త బాధ్యతలను ఆయన విజయవంతంగా నిర్వహిస్తారని ఆకాంక్షిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాదు, కాంపాటి రవి, నాగేశ్వరావు తదితరులు పాల్గొని భాస్కర్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రతిమ ప్రాజెక్టు వద్ద 13 రోజులుగా బాధితుల దీక్ష

## విధి నిర్వహణలో మృతి చెందిన జంపయ్య కుటుంబానికి న్యాయం చేయాలి



**ములకలపల్లి/మార్చి 21(జర్నలిస్ట్ వార్త);**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని సీతారామ ప్రాజెక్టు పనుల్లో భాగంగా 'ప్రతిమ ప్రాజెక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్' సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ మరణించిన జంపయ్య కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి డిమాండ్ చేశారు. గత 13 రోజులుగా ప్రాజెక్టు ప్రధాన గేటు వద్ద టెంట్ వేసుకుని నిరసన తెలుపుతున్న మృతుని కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి, తమ మద్దతు ప్రకటించారు.

**ఎమ్మెల్యే హామీ ఏమైంది?**

ఈ సందర్భంగా తంబళ్ల రవి మాట్లాడుతూ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు:

హామీలు గాలికి: జంపయ్య మరణించిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు వచ్చి బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని, కానీ రెండు నెలలు గడుస్తున్నా ఆ హామీలు నెరవేరలేదని విమర్శించారు. గత 13 రోజులుగా చంటి పిల్లలతో సహా కుటుంబ సభ్యులు రోడ్డుపై దీక్ష చేస్తున్నా, అటు యాజమాన్యం గానీ, ఇటు ప్రభుత్వం గానీ స్పందించకపోవడం దారుణమన్నారు.

8 ఏళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణిస్తే, విచారణ జరిపి ఆదుకోవాల్సిన బాధ్యత సంస్థపై ఉందన్నారు.

**బీజేపీ డిమాండ్లు ఇవే..**

మృతుని కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలి. కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి సంస్థలో ఉద్యోగం కల్పించాలి.

యాజమాన్యం మొండివైఖరి వీడకుంటే, బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడ్డ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడంలో జాప్యం చేయడం అన్యాయం. అధికారులకు కనీస చలనం లేకపోవడం శోచనీయం. తంబళ్ల రవి

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గూడా ముత్యాలరావు తదితరులు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు.

# ఏపీలో రేషన్ షాపుల్లో మళ్ళీ కిరోసిన్ పంపిణీ.

## వచ్చే సోమవారం నుంచి లీటరు చొప్పున కిరోసిన్ పంపిణీ.

**అమరావతిమార్చి 21(జర్నలిస్ట్ వార్త);**
హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల ప్రభావంతో విశాఖపట్నానికి ఈ నెల 21వ తేదిన రావాల్సిన గ్యాస్ నౌక 26వ తేదిన చేరనున్నట్టు కేంద్రం సమాచారం ఇచ్చిందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అప్పటి వరకు సరఫరాలో అంతరాయం లేకుండా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం గ్యాస్ కొరత నేపథ్యంలో కేంద్రం కేటాయించిన 2800 కిలో లీటర్ల కిరోసిన్ ను వచ్చే సోమవారం నుంచి రేషన్ ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో లీటరు చొప్పున పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.



